నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 25 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

నేడు మహా శివరాత్రి ప్రత్యేకం



మనసులో నింపుకుంటే..
మూలస్తానేశ్వరుడే..

# మనోస్తానేశ్వరుడు

మహాదేవునికి పరామశివునిగా లింగ మూర్తిగా.. ఆయన లీలా వినోదం అమోఘం.. అఖండం. లయకారునిగా.. ఆది దేవునిగా మహాదేవుని దివ్య చైతన్య శక్తి సకల ప్రకృతిలో ప్రస్ఫూటమవుతుంది. లింగమూర్తిగా ఆవిష్కకరమై ఆద్రంతాలు లేని జగత్ కారకాశక్తిగా మహాదేవుడు పూజలునందుకొంటున్నాడు. స్వామికి ఆకృతి ఒక్కటే అయినా ఎన్నో పేర్లతో విరాజిల్లుతూ.. తన బహుముఖ వైభవ ప్రభావాన్ని ప్రకటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అవిష్కరణమైన స్వరూపమే.. శ్రీ మూలస్తానేశ్వర స్వామి. నెల్లూరు జిల్లా కేంద్రంలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్తానేశ్వరస్వామిగా సాకారమై ఆది దేవునిగా అనాది దేవునిగా పూజలందుకొంటున్నాడు. ఈ విఖ్యాత శివ సన్నిధి విశేషాలను నేడు మహా శివరాత్రి పర్వదినోత్సవ సందర్భంగా 'సూర్య' దినపత్రిక అందిస్తుంది.

లోపల పేజీలో

దొడ్ల శంకరమ్మ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చేందుకు

## అందరూ సహకరించాలి

**విద్య, వైద్యరంగాల్లో దొడ్ల కుటుంబం సేవలను కొనియాడిన కలెక్టర్ ఆనంద్**

మహ్మదాపురం గ్రామంలో దొడ్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా నిర్మించిన దొడ్ల శంకరమ్మ హాస్టల్ బ్లాక్‌ను కలె క్టర్ సమక్షంలో మంగళవారం ప్రభుత్వానికి అప్పగించారు.

లోపల పేజీలో






## రూ.2 కోట్లతో బుచ్చి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి


- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి సౌకర్యాలు
- చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :**

కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం పట్టణ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నారని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి ప్రశంసించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 2 కోట్లు వెచ్చించి ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చనున్న నేపథ్యంలో ఆమె బుచ్చి పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శించారు. హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ పద్మజతో సమావేశమయ్యారు. ముఖ్యంగా గుండె సంబంధ వ్యాధులు, చిన్న పిల్లల అత్యవసర వైద్య సేవలకు కావలసిన లేటెస్ట్ ఎక్విప్మెంట్ యెక్క ఆవశ్యకత గురించి అడిగి తెలుసు కున్నారు. బుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 2 కోట్ల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిల్ ఫండ్స్ ద్వారా అత్యాధు నిక వైద్య పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివ కుమార్ రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యు లు కోదండరామిరెడ్డితోపాటు స్థానిక డాక్టర్లు వెంకటేశ్వర్లు, సుమన్, అబ్దుల్ సమద్‌లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రజలకు వేమిరెడ్డి దంపతుల

## శివరాత్రి శుభాకాంక్షలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

శివం అంటే చైతన్యమని, శివుడు లింగా కారంలో ఉద్భవించిన పవిత్ర దినం మహా శివరాత్రి సందర్భంగా జిల్లా ప్రజలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి ల శుభాకాంక్షలు తెలిపారు. అభిషేక ప్రియుడైన శివుడు ఆది దేవుడని, కోరిన వరాలిచ్చే భోళా శంకరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాలు ఆనం దమయం కావాలని ప్రకటనలో ఆకాంక్షించారు. శివతత్వం సర్వ మానవాళికి సదా అనుసరణీయ మని వేమిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. శుభాలు కలిగించే ఆ శంకరుడి అనుగ్రహంతో జిల్లా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి కలిసిన కొండ్రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**


జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డిని నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు బుధవారం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి మాజీ మంత్రి కాకాణిని నెల్లూరు నగరంలోని డైకాస్ రోడ్డులోని ఆయన నివాసంలో కలిసి



పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్ ఉన్నారు.

## మనస్సులో నింపుకొంటే..

# మూలస్తానేశ్వరుడే.. మనోస్తానేశ్వరుడు



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** 1400 సంవత్సరాల క్రితం నెల్లివృక్షం ఆవిష్కరమైన ఈశ్వర స్వరూపమే మూలస్తానేశ్వరస్వామి. నెల్లూరుకు ఆపేరు ఏర్పడటానికి స్వామి ఆవిష్కరమే ప్రధాన కారణం. నెల్లూరులోని మూలపేటలో ఈ సుప్రసిద్ధ శివాలయం నెలకొని నెల్లూరు సీమకు నవశోభను ఆపాదింపజేసింది. నెల్లి అంటే ఉసిరి అని అర్థం. ఉసిరికా చెట్టుకింద శివలింగం ప్రకటితమైంది కనుక నెల్లి ఊరు అని పిలిచేవారు. అది క్రమేణా నెల్లూరుగా ప్రసిద్ధికాంచింది. స్వామి కొలువు తీరివున్నా మూలపేటలో సువిశాల ప్రాంగణంలో ఆలయం భక్త జనావళిని అనుగ్రహిస్తుంది. ప్రధాన రహదారి పక్కన వర్ణ రంజితమైన ముఖద్వారం భక్తులకు సదా స్వాగతం పలుకుతుంది. గణేష్, కుమారస్వామి, శివపర్వాతులమూర్తులు ఈ స్వాగత తోరణంపై బాసిల్లుతాయి. ప్రధాన ఆలయ ముంగిట మహారాజగోపురం నయన మనోహరంగా కొలువు తీరి ఉంటుంది. మూడు అంతస్తులతో పంచకలిశాయుక్తంతో వీరాజిల్లుంది. గోపురం ముందు ముఖమండపం ముందు మహాదేవుని విరాట్ స్వరూపం తేజారిల్లుతుంది. మూలస్తానేశ్వరస్వామి ఆలయానికి అభిముఖంగా మహాగణపతి భారీ విగ్రహం భక్తులకు దర్శనం ఇస్తుంది. గర్భాలయంలో నెలకొన్న మూలస్తానేశ్వర స్వామి సన్నిధిలో ప్రథమ గణపతి అయిన గణేశుని దర్శించుకొంటూ నవగ్రహ ప్రదక్షిణం దేశంలోనే ప్రదమంగా నిర్మితమై భక్తులను అల రింపచేస్తోంది. తమ ఇష్ట కామ్యాలన్నీ నెరవేర్చే మహాదేవుని భక్తులు బారులు తీరి దర్శించుకొంటారు. భక్తులు కోరిన వరాలు ఇచ్చే అమృత వల్లిగా.. కల్పవల్లిగా భువనేశ్వరి మాత పూజాలందుకొంటుంది. స్వామి ఆలయానికి ఎడమవైపు భువనేశ్వరి మాత కొలువుతీరి భక్తజనాన్ని అనుగ్రహిస్తుంది.

త్రిభువనాలను పాలించే ఆదిశక్తి రూపమే భువనేశ్వరివి అవతారం. అమ్మవారి ఆలయం చుట్టూ నవదుర్గలు దర్శనం ఇస్తాయి. మనసారా నమ్మి హృదయం తరాలలో ఆస్వామిని సుప్రష్టితం చేసుకొని స్థానం కల్పిస్తే ఆస్వామి మూల స్తానేశ్వరుడు ప్రతి భక్తుని హృదయంలో మనోస్టానేశ్వరునిగా వీరాజిల్లుతాడు. ఇంతటి మహిమన్వితమైన ఈ ఆలయం మహాశివరాత్రికి నూతన శోభతో అలంకృతమై భక్తులను అలరింపజేయనుంది.

## నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన

# బడ్జెట్ రూపకల్పన

### మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా నూతన బడ్జెట్‌ను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ రూపకల్పన సమావేశాన్ని మేయర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థకు బడ్జెట్ కేటాయింపులో భాగంగా అన్ని విభాగాల అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని తుది మెరుగులు దిద్దుతున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు నూతన బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించనున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నగరపాలక సంస్థ బడ్జెట్ కేటాయింపులు చేపట్టామని, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధిని చూపేందుకు ప్రణాళికాబద్ధం గా బడ్జెట్‌ను రూపొందించనున్నామని మేయర్ ప్రకటించారు. విభాగాల వారీగా రూపొందించిన బడ్జెట్లో నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనులకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ కేటాయింపులు జరపనున్నామని, అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రతిష్టాత్మకంగా రూపొందించి, అమలు చేస్తామని మేయర్ వెల్లడించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయండి : కమిషనర్ సూర్యతేజ




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** పట్టణ, పురపాలక సంఘాల పరిధిలో సేకరించిన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేసి, వ్యర్థాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఒంగోలు, కావలి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్లతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సమావేశమై వ్యర్థాల నిర్వహణపై ప్రధాన అంశాలను చర్చించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోజువారీ జరిగే వ్యర్థాల ఉత్పత్తి, సేకరణ విధానం గురించి వివరించారు. ప్రస్తుతమున్న విధానంలో తడి, పొడి, హానికరమైన వ్యర్థాలను విడివిడిగా సేకరించడం, వాటిని డంప్ యార్డ్‌కు తరలించే ప్రక్రియను వివరించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో మరో రెండేళ్ల వ్యవధిలో వ్యర్థాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు తెలియజేశారు. ఆ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యేంతవరకు, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం సేకరిస్తున్న 7 - 8 లక్షల టన్నుల వ్యర్థాలను గుంటూరులో నడుస్తున్న విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు ప్రకటించారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో సేకరించిన వ్యర్థాల తరలింపు కోసం నెల్లూరు నుండి గుంటూరు వరకు 32 టన్నుల సామర్థ్యం గల కంపాక్టర్ వాహనాలను వినియోగించనున్నట్లు కమిషనర్ వివరించారు. సమావేశంలో భాగంగా వ్యర్థాలను తరలించే కంపాక్టర్ వాహనాల వినియోగం, వ్యర్థాలను సేకరించే విధానం, కంపాక్టర్ వాహనాల వినియోగంతో ఖర్చు తగ్గించుకునే విధానాలను, వాహనాల వినియోగంలో ఉన్న సౌలభ్యాన్ని కమిషనర్ ఇతర కమిషనర్లకు వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. అనంతరం సమావేశానికి హాజరైన కమిషనర్లతో మాట్లాడుతూ.. వారి ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాల పరిమాణం, రోజువారీ సేకరణ విధానం, ఎంత పరిమాణం మేరకు ప్రతిరోజు సేకరిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# దొడ్ల శంకరమ్మ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చేందుకు అందరూ సహకరించాలి

## విద్య, వైద్యరంగాల్లో దొడ్ల కుటుంబం సేవలను కొనియాడిన కలెక్టర్ ఆనంద్



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మహ్మదాపురం గ్రామంలో దొడ్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా నిర్మించిన దొడ్ల శంకరమ్మ హాస్టల్ బ్లాక్‌ను కలెక్టర్ సమక్షంలో మంగళవారం ప్రభుత్వానికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల్లో దొడ్ల కుటుంబం సేవలను కొనియాడారు. దొడ్ల శంకరమ్మ పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. హాస్టల్, పక్కనే ఉన్న జడ్పీ హైస్కూల్, ఎస్సి, బీసీ వసతి గృహాలను ఒక మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి మోడల్ స్కూల్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, విశాలమైన క్రీడా మైదానంలో వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్ కోర్టులు, మోడల్ కిచెన్ వంటి అత్యాధునిక వసతులను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఒక మంచి పాఠశాల ఏర్పాటు చేసేందుకు దాతలు, గ్రామస్తులు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ తమవంతు ప్రయత్నంగా పాఠశాల అభివృద్ధికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా కూడా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు 800 నుంచి 1000 మంది విద్యార్థుల సంఖ్య ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులకు సూచించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులందరికీ అనుకూలంగా వసతి గృహాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రెండు, మూడేళ్లలోనే మహ్మదాపురం హైస్కూల్‌ను అత్యున్నత ప్రమాణాలతో మోడల్ స్కూల్‌గా తయారుచేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏదైనా చేయాలనే తపన ఉన్న కలెక్టర్ జిల్లాకు రావడం మన అదృష్టంగా చెప్పారు. తాను ఇప్పటి వరకు సుమారు 10 మంది వరకు కలెక్టర్లను చూశానని, వారందరి కంటే చిన్న వయస్కుడైనా కమిట్‌మెంటు ఉన్న కలెక్టర్ ఆనంద్ అని కొనియాడారు. దొడ్ల శంకరమ్మ పేరుతో హాస్టల్ భవనాన్ని నిర్మించి కలెక్టర్‌కు అప్పజెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. తొలుత పాఠశాలకు విచ్చేసిన కలెక్టర్‌కు దొడ్ల కుటుంబ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ హాస్టల్ గదులను, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణ దాతలు, దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి, దొడ్ల డెయిరీ ఎండీ దొడ్ల సునీల్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు వెంకటసుబ్బమ్మ, శోభారాణి, గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముగిసిన అంగనవాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమం

## సర్టిఫికెట్స్ అందజేసిన ఎంఈఓ సాయి ప్రసాద్

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గత ఆరు రోజుల నుండి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు మంగళవారం ఐసిడిఎస్ ఆత్మకూరు సిడిపిఓ సునీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెస్మెంట్ కార్డు పిల్లల సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే 5 అభివృద్ధిల గురించి వివరించారు పిల్లలు శారీరకంగా మానసికంగా పరిపూర్ణత సాధించే లక్ష్యంలో ఈ శిక్షణ కొనసాగిందని తెలిపారు. పోషణను అందిస్తూ పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధించాలని తెలిపారు. అనంతరం జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం చివరి రోజున కార్యక్రమానికి హాజరై శిక్షణ తీసుకున్నటువంటి 52 మంది అంగన్వాడీ కార్యకర్తలకు మండల విద్యాశాఖ అధికారి డి.సాయి ప్రసాద్ చేతులమీదుగా సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది.



ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సనల్‌గా గరిసిపాటి సుబ్బయ్య నెల్లూరు జగదీష్ కుమార్ రెడ్డి మేకల వెంకటేశ్వర్లు వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి కస్తూరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## రెవిన్యూసమస్యలను పరిష్కరించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు డివిజన్‌లోని పలువురు పేదలకు సంబంధించిన రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ అండ్‌మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శేషం సుదర్శన్ స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనిని కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన ఆర్డీవోకు ఒక వినతిపత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన భూములకు సంబంధించి పలు సమస్యలున్నాయని, వాటిని పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. డివిజన్‌స్థాయిలో విజిలెన్స్‌మానిటరింగ్ కమిటీల త్రైమాసిక సమీక్షలు నిర్వహించడంలేదని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి చర్యలు తీసుకోవాలని సుదర్శన్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, విద్యార్థి సంఘ రాష్ట్ర నాయకుడు కూరపాటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దుల పోటీలకు అపూర్వ స్పందన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వేమిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో గండవరం శివాలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తూ ఎద్దుల బండలాగు పోటీలను మంగళవారం నిర్వహించారు. మొట్టమొదటిసారిగా గండవరంలో ఈ ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న గ్రామల ప్రజలు తండో పతండాలుగా ప్రజలు గండవరానికి చేరుకొని వీక్షించారు. కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత ఉదయ కాళే శ్వర స్వామి వారి దేవస్థానంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన ఎద్దులబల ప్రదర్శ నలను జెండా ఊపి ప్రారంభించిన వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కార్పొ రేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది. అనంతరం పోటీలలో గెలుపొందన వారికి మొదటి బహుమతిగా లక్ష రూపాయలు, రెండవ బహుమతిగా 75000, మూడో బహుమతిగా 50వేల రూపాయలను అందజేశారు. అదేవిధంగా ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు కన్సోలేషన్ బహుమతిగా పదివేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమం వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామ ప్రజలు, సర్పంచ్ బొచ్చు రాజకుమారి, ఉపసర్పంచ్ ఆలం మాల కొండయ్య, నీటి సంగం ప్రెసిడెంట్ కంచి ఈశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

## టీడీపీలో చేరినందుకే వైసీపీ నాయకుల కక్షసాధింపు : కౌన్సిలర్ దగ్గుమాటి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశంలో తాను ఇటీవల చేరినందున తమ గ్రామ వైసిపి నాయకులు తనపై కక్షసాధింపుకు దిగారని ఆత్మకూరు 2వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటారెడ్డి పేర్కొన్నారు. ఆయన ఒక స్థలానికి అక్రమంగా కంచెవేశారని వైసిపి వారు సోషల్‌మీడియాలో విమర్శించడం, అధికారులకు ఫిర్యాదులు చేయడం జరుగుతుండగా మంగళవారం శివకోటారెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాను ఇండిపెండెంట్‌గా కౌన్సిలర్‌గా గెలుపొందానని, ఇటీవల తాను తెలుగుదేశంలో చేరానని పేర్కొన్నారు. తన హక్కు, అనుభవంలో ఉన్న స్థలానికి కంచెవేసుకున్నానని, దాన్ని రాద్ధాంతం చేస్తూ ఫిర్యాదులు చేస్తున్నారని వివరించారు. తన స్థలాన్ని కబ్జాచేసేందుకు వైసిపి నాయకులు యత్నించారని, తమ స్థలానికి తాను కంచెవేసుకుంటే తప్పుడు కథనాలతో ఫిర్యాదులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మూడుతరాలుగా 30 కుటుంబాలకు చెందిన తమ స్వంత స్థలాన్ని ఇటీవల కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తుండగా తాను చుట్టేరా కంచెవేశానన్నారు. అధికారులు వాస్తవాలను పరిశీలించాలని, తన స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని శివకోటారెడ్డి కోరారు.

## మార్చి 3 వరకు ఈ-పంట నమోదుకు గడువు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు తాము సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ లో నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.దేవసేనమ్మ కోరారు. మంగళవారం మండలంలోని మహిమలూరులో మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులనుద్దేశించి దేవసేనమ్మ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరాలను ఈ-క్రాప్ నమోదుకు తుదిగడువుగా పేర్కొన్నారు. ఈలోగా రైతులందరూ నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. ఇకెవైసి కూడా పూర్తి చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. అన్నదాతసుఖీభవ, పంటలభీమా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు తదితరాలన్ని ఈ-పంట నమోదుచేసుకున్న రైతులకే వర్తిస్తాయని ఆమె పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీలోగా స్వంత భూమికలిగిన ప్రతి రైతు రైతురిజిస్ట్రీపోర్టల్ ద్వారా రైతుసేవాకేంద్రంలో విశిష్టగుర్తింపుసంఖ్య పొందాలని కోరారు. అనంతరం రైతులతో కలిసి అధికారులు సాగులో ఉన్న పొలాలను పరిశీలించి సాగునీటి వినియోగం, సస్యరక్షణ, ఎరువుల వినియోగం తదితరాలను గురించి చర్చించుకొన్నారు. ఈకార్యక్రమంలో విఏఏలు సి.హెచ్ కీర్తన, షేక్ ఖాజానవాజ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కలివెలపాలెం, మాదరాజు గూడూరులో పొలం పిలుస్తుంది

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలంలోని కలివెలపాలెం, మాదరాజు గూడూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు నెల్లూరు రూరల్ మండల వ్యవసాయ అధికారి నాగమోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరించినారు ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని తెలియజేశారు. దీనికోసం రైతు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సిబ్బందికి పాస్ బుక్ పొలం పాస్ బుక్ ఆధార్ కార్డు, లింక్ అయిన ఫోన్ తీసుకెళ్లి కంప్లీట్ చేయించుకోగలరు. రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరినారు. అదేవిధంగా కలివెలపాలెం, మాదరాజు గూడూరులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉన్నాయని తెలియజేశారు. వ్యవసాయ పరికరాలు కూడా కావాలని కోరినారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. తెగుళ్లు తక్కువగా ఉన్నాయని రైతులు పురుగుమందులు ఎక్కువ వినియోగించవద్దని అవసరం మేర వాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, గ్రామ పెద్దలు శ్రీనివాసులు రెడ్డి వ్యవసాయ సిబ్బంది అభిలాష్ ధర్మతేజ పాల్గొన్నారు.

## ఫ్యామిలీ కోర్టు పీపీగా సుందరయ్య



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఫ్యామిలీ కోర్టు ప్రత్యేక న్యాయస్థానానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది మద్దిబోయిన సుందరయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది సుందరయ్య ఈ పదవిలో మూడేళ్లపాటు పనిచేస్తారు. నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన న్యాయవాది సుందరయ్య న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించి స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగారు. నెల్లూరు న్యాయవాదుల సంఘానికి సుందరయ్య ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సుందరయ్యను నియమించడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ప్రాసిక్యూటర్‌గా నియమించడం పట్ల పలువురు సీనియర్ న్యాయవాదులు సుందరయ్య యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

## ఇడిమెపల్లిలో పొలం పిలుస్తోంది



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఇడిమెపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరిపంటలో తెగుళ్లు, పురుగుల నివారణపై ఎ.నర్సోజీ రావు వివరించారు. అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఎన్. శ్రీనివాసులు సూచించారు. ఫార్మర్స్ రిజిస్ట్రేషన్, పంట నమోదు (ఈ-క్రాప్), ఈ- కేవైసీ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి తెలిపారు. ఇలా చేయకపోతే పీఎం- కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా వంటి పథకాలు రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి అని అధికారులు కోరారు.

## వెంకటాచలంలో జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీపీ1, పీపీ2 విద్యార్థుల భాషా నైపుణ్యాల కోసం నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ ముగిసింది. ముగింపు కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి.కల్పన పాల్గొని, అంగన్వాడీ టీచర్లు శిక్షణలో నేర్చుకున్న విషయాలను పిల్లల అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో మెమెంటోలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి వి.శ్రీనివాసరెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పూజ కార్యక్రమంలో కండ్లగుంట దంపతులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం బోగోలు మండలం నాగుల వరం గ్రామంలో ఉన్న గంగా పార్వతి సమేత శివాలయంలో ఉత్సవాల సందర్భంగా మంగళవారం మొదటి రోజు పుణ్యవచనం నవగ్రహ ఆరాధన పూర్ణాహుతి హెూమ కార్యక్రమంలో ఉభయ కర్తలుగా కండ్లగుంట. మదు బాబునాయుడు- సౌజన్య పాల్గొన్నారు. రుద్రాభిషేకం ఉత్సవ మూర్తుల అభిషేకం ఉభయ కర్తలుగా పరసా.క్రాంతి కుమార్ - మాధవి అమ్మ వారి పూజా కార్యక్రమాలలో పాల్గొని భక్తులుకు తీర్ధ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు పద్మనాభం కృష్ణయ్య, రమేష్ రెడ్డి, రామా రావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు కంచర్ల రమణయ్య, చెరువు సంగం అధ్యక్షుడు వేణు, శ్రీహరి నాయుడు, గ్రామ ప్రజలు శివ స్వాములు యువత మహిళలు పాగొన్నారు.

## సౌత్ జోన్ టోర్నమెంట్‌లో వీఎస్‌యూ వైస్ ఛాన్సలర్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ పురుషుల జట్టు ఫిబ్రవరి 28న సేల జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ సందర్భంగా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు జట్టు సభ్యులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. క్రీడల్లో విజయం కోసం క్రమశిక్షణ, కఠిన శ్రమ ముఖ్యం' అని ఆయన అన్నారు. క్రీడాకారులకు విశ్వవిద్యాలయం పూర్తి మద్దతు అందించనున్నట్లు తెలిపారు.

### మెట్ట ప్రాంతాన్ని సిరుల గిరిగా

# అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే ధ్యేయం

- కాకర్ల సురేష్ పై అసత్య ప్రచారం మానుకోవాలి
- మాజీ జడ్పీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతాన్ని వ్యవసాయం, పారిశ్రామిక, పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ధ్యేయం అని మాజీ జడ్పీ చైర్మన్ పొన్నె బోయిన చంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరిలోని పొన్నె బోయిన చంచలబాబు అతిధి గృహంలో ఉదయగిరి మండల నాయకులతో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజాసేవకు అంకితమై, తమ సొంత నిధులను వెచ్చించి కోట్లాది రూపాయలతో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించిన దాతలు వారు అని కొనియాడారు. ప్రజాసేవకై రాజకీయాలలోనికి వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పై ప్రతిపక్ష నాయకుల పోద్భలంతో బులుగు మీడియా ప్రచారం చేయడం దుర్మార్గపు చర్య అని ఆయన తెలిపారు. ప్రతిపక్ష నాయకులు కూడా హుందాగా వ్యవహరించాలి గాని పనిగట్టుకొని అసత్య ప్రసారాలు చేయకూడదని హితవు పలికారు. రైతన్నల అభ్యున్నతి కోసం పొన్నుబోయిన చెంచురామయ్య గండిపాలెం రిజర్వాయర్ నుండి కాలువ పూడిక తీత పనులు చేయించి నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ది అని తెలిపారు. అలాగే సోమశిల హై లెవెల్ కెనాల్ ద్వారా జలదంకి కొండాపురం మండలాలకు సాగునీరు అందించారన్నారు. సాగునీరు ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన తెలిపారు. అభివృద్ధి చెందిన దేశం అమెరికా అని అక్కడ లేనిది మెట్ట ప్రాంతంలో ఏముందని అన్నారు. సిరి సంపదలు భోగభాగ్యాలతో తల తూగుతున్న ఆయన మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అభివృద్ధి చేసి ఈ ప్రాంతం సిరిసంపదలతో తల తూగాలన్న సంకల్పంతో ఆయన ముందుకు వెళుతుంటే ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేసి ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ఈ కుట్రను తిప్పి కొడతామని ఆయన వెనుక బలమైన నాయకత్వం ఉందని చంచల బాబు తెలియజేశారు. ఇకపై మాట్లాడే ముందు ప్రచారం చేసే ముందు ఆలోచించుకొని నిజనిర్ధారణ చేసుకొని మాట్లాడాలని మీడియా ద్వారా ప్రసారం చేయాలని ఇష్టానుసారం చేస్తే ఇకపై సహించేది లేదని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కనుక ఉదయగిరి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం అవ్వాలని అభివృద్ధి ఆ దిశగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, మాజీ సర్పంచ్ ఎస్ కే రియాజ్, ఆవుల అరుణ, అడుసు పల్లి వెంకటసుబ్బయ్య బొజ్జ నరసింహులు నల్లి పోగు రాజా, బొజ్జ శ్రీను, గడ్డం వెంకటస్వామి, సయ్యద్ నావాజ్, సిహెచ్ రమణయ్య భాస్కర్ రెడ్డి రమణారెడ్డి రఘురాంరెడ్డి తుమ్మల కిరణ్ కుమార్ జల్సా హరీష్ సందని తదితరులు ఉన్నారు.

## నేలటూరులో పొలం పిలుస్తుంది



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వరి పంట వేసిన రైతులను ఉద్దేశించి రైతు సేవ కేంద్రం నందు ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు వరి పంటను గుడినరవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి వరి కొనుగోలు కేంద్రంలో కనీసం మద్దతు ధరకి అమ్ముకోవాలని కోరారు. రైతులు ఎవరూ కూడాను బయట దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం రైతు విశిష్ట గుర్తింపు కార్డు గురించి రైతులకు స్పష్టంగా తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడం వలన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రైతులకు వచ్చే లాభాలను తెలియజేశారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీలో విత్తనాలు, ఎరువులు, పంట నష్టం, పంటల బీమా పొందాలి అంటే రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో రైతు విశిష్ట గుర్తింపు కార్డు చేయించుకోవాలని కోరారు. అందుకోసం రైతులు ఆధార్‌కార్డు, పొలం 1బీ, ఆధార్‌కి లింక్ అయినటువంటి ఫోన్ నెంబరు తీసుకొని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలియజేశారు. అనంతరం పలు గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు కార్డు పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ నుండి టీఏ అజిత్, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ప్రాథమిక విద్యను కాపాడుకుందాం

## ఉర్దూ స్కూల్‌లను కాపాడాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండల పరిధిలోని స్కూళ్లను యథావిధిగా కొనసాగించాలని మంగళవారం అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయగిరి తాసిల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ.. గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని, అలాగే ప్రాథమిక స్కూల్‌లను కాపాడాలని ఆవాజ్ మండల మండల కార్యదర్శి నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉర్దూ స్కూల్లను కాపాడాలని ఉర్దూ స్కూల్లో టీచర్లను నియమించి ఉర్దూ బోధనలను విద్యార్థులకు సక్రమంగా నిర్వహించాలని, స్కూళ్లలో సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 117 తీసుకుని వచ్చి రాష్ట్రంలోనే 12,247 పాఠశాలలను ఏకోపాధ్య పాఠశాలలుగా మార్చింది, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ప్రస్తుత ఈ ప్రభుత్వం అదే మాదిరి విద్యా విధానాన్ని తీసుకు వస్తుందని అన్నారు. నాలుగు విధాల విద్యా విధానం తీసుకువస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. దీని వలన కొన్ని ప్రాథమిక పాఠశాలలో బేసిక్ పాఠశాలలుగా, కొన్ని పాఠశాలలో ఆదర్శ పాఠశాలలుగా మార్తాయని చెబుతున్నారు. ఆదర్శ పాఠశాల సంగతి ఎట్లా ఉన్నా బేసిక్ పాఠశాలలు మూతపడే ప్రమాదం వుంది. ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలుగా మారిన పాఠశాలల విద్యార్థులకు ఎటువంటి నష్టం లేదని, కానీ ప్రాథమిక పాఠశాలలో యధావిదంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు నియమించి విద్యార్థులకు విద్యను అందించేందుకు ఏర్పాటు చేయాలి. ఆదర్శ పాఠశాలలో, బేసిక్ పాఠశాలల వలన మాతృభాషకి విద్యార్థులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈవిద్యా విధానం వలన భాషా ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోతారని ఆయన తెలిపారు. కావున ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదన విరమించి పాత విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకొని స్కూళ్ళు కాపాడేందుకు పోరాటాలకి పోతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు ఖాజావలి విక్రమ్ ఆలం భాష, మండల కార్యదర్శి మహమ్మద్ రఫీ నాయిబ్ రసూల్ సిఐటియు నాయకులు గడ్డం నాగేశ్వరరావు సిఐటియు కార్యకర్తలు అవాజ్ కమిటీ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

## పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా చంద్రశేఖర్



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే ప్రత్యేక న్యాయస్థానానికి (పోక్సో కోర్టు) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది దూబిశెట్టి చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది చంద్రశేఖర్ ఈ పదవిలో మూడేళ్లపాటు పనిచేస్తారు. నెల్లూరు నగరం నవాబ్ పేటకు చెందిన న్యాయవాది చంద్రశేఖర్ 2001లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించి స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగారు సివిల్ క్రిమినల్ చట్టాలే కాకుండా రెవెన్యూ, వినియోగదారుల రక్షణ చట్టం మీద కూడా పట్టు కలిగిన న్యాయవాది కావడం విశేషం. చంద్రశేఖర్ ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పోక్సో నేరాల విచారణ నిమిత్తం జిల్లా మొత్తానికి ఒకే కోర్టు అయిన స్పెషల్ పోక్సో కోర్టుకు ప్రాసిక్యూటర్‌గా నియమించడం పట్లపలువురు సీనియర్ న్యాయవాదులు చంద్ర శేఖర్‌కు అభినందనలు తెలిపారు.

## సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం ముత్తుకూరు పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ విభాగాన్ని మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన 32 లొకేషన్‌లతో 55 సీసీ కెమెరాలు కంట్రోల్ రూమ్ ప్రారంభించి దాని ఆవశ్యకతను తెలియజేసినారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడారు. నేరాలు నియంత్రణకు కంట్రోల్ రూమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రవి నాయక్, ఎస్ఐలు విశ్వనాథరెడ్డి, జెపి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగర అధ్యక్షుడుగా బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పేరు ఖరారు చేయండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సీటీ వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడుగా 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పేరు ను ఖరారు చేయాలని జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోరారు. మంగళవారం జిల్లా వైయస్సార్ పార్టీ కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కాకాణి గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు నగర అధ్యక్షుడుగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం తరుపున 37వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ ని ప్రతిపాదన చేయాలని కోరారు. నెల్లూరు నగర అధ్యక్షుడుగా నియామకానికి ప్రతిపాదనకు సహకరించిన నెల్లూరు నగర సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## వీఎస్‌యూ అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ మద్దతు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకరించనున్నట్లు రీజనల్ హెడ్ ఏ.రాజశేఖరం తెలిపారు. విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలు, విద్యా రుణాలు అందించడంతో పాటు, త్వరలో విశ్వవిద్యాలయానికి ఎలక్ట్రిక్ కార్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు దీనిని విశ్వవిద్యాలయ అభివృద్ధికి గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయ అధికారులు, బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు తప్పవు

- అటవీశాఖ అధికారుల హెచ్చరిక
- అటవీ ప్రాంతాలలో ముమ్మర తనిఖీలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలంలోని తాళ్లూరు, కొత్తూరు, వెస్ట్రన్ కాలనీ, రామస్వామి పాలెం సమీపంలోని ప్రాంతాలలో గత కొంతకాలంగా వన్యప్రాణుల వేట జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున ముమ్మర తనిఖీలు చేపట్టారు. అటవీ ప్రాంతానికి సమీపాన ఉన్న ప్రాంతాలు కావటంతో అధిక సంఖ్యలో జింకలు ఈ ప్రదేశాలలో సంచరిస్తుంటాయి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారని భారీ లైట్లతో నిర్మానుష ప్రాంతాలలో వేట సాగిస్తున్నారని వచ్చిన పక్కా సమాచారంతో పెట్రోలింగ్ నిర్వహించారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న కొత్తూరు గ్రామ శివారులో కొందరు రైతులు పొలంలో వన్నె ప్రాణులకు ఏర్పాటుచేసిన కరెంటు తీగలను అధికారులు గుర్తించారు. వన్యప్రాణులు, మనుషులు విద్యుత్ ఘాతానికి గురై చనిపోయే అవకాశం ఉందని విద్యుత్ తీగలను అమర్చడం నేరమని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడటం వాటి మరణానికి కారణమైన వారిపై కఠిన శిక్షలు పడుతాయని అన్నారు. వన్యప్రాణాలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ఇకపై ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి సుమన్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

# 10 నెలలుగా రాని జీతాలు.. అవస్థలు పడుతున్న ఉద్యోగులు




**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో పది నెలలుగా జీతాలు రాక ఆ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఈ కార్యాలయంలో ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇద్దరు ఔట్సోర్సింగ్ కింద అసిస్టెంట్ ఇంజనీర్లు పనిచేస్తున్నారు. అదేవిధంగా రికార్డ్ అసిస్టెంట్ ఒకరు, ఔట్సోర్సింగ్ కింద ఒక కంప్యూటర్ ఆపరేటర్, వాచ్‌మెన్ ఈ కార్యాలయంలో పనిచేస్తున్నారు. గత 10 నెలలనుంచి జీతాలు రాక ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతినెల జీతం తీసుకోవాల్సిన ఉద్యోగులు 10 నెలలైనా ఇంతవరకు వీరికి ప్రభుత్వం నుంచి జీతాలు అందక పోవడం విశేషం. అదేవిధంగా ఈ కార్యాలయంలో ఉన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్‌గా అదనంగా బాధ్యతలు అప్పగించడం విశేషం. అసిస్టెంట్ మేనేజర్ గా ఆయనకు బాధ్యతలు అదనంగా అప్పగించినారు. దీంతో ఈ అధికారి ఒంగోలు, బాపట్ల, చీరాల, నెల్లూరు తదితరచోట్ల విధులు నిర్వహించాలి. ప్రస్తుతం పెరిగిన నిత్యవసర ధరలతో పది నెలలుగా జీతాలు రాక ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు పడే అవస్థలు వర్ణాతీతం. ఇకనైనా అధికారులు ఏపీ ఎస్ ఐడిసి ఉద్యోగులకు అందవలసిన జీతాలు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పది చాలా కీలకం..

- పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి
- నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు
- సౌత్ మోపూరులోని వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ పది విద్యార్థులకి ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామంలో వాణిశ్రీ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులకి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు చాలా కీలకమని ఇందులో రాణిస్తే ఉన్నత చదువుల్లో కూడా బాగా రాణించవచ్చని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం సౌత్ మోపూరు గ్రామంలోని వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ విస్సావావిలేటిపాడు సౌజన్యంతో ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు, ఎస్ఐ లక్ష్మణరావులు విచ్చేశారు. ముందుగా వీరికి గ్రామ నాయకులు, ఫౌండేషన్ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ చేతుల మీదుగా సుమారు 60 మంది పది విద్యార్థులకి పరీక్ష మెటీరియల్‌ను అందచేశారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన ఆల్తూరి ఫౌండేషన్ చైర్మన్ ఆల్తూరి మస్తానయ్య సేవల్ని కొనియాడారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి.. తల్లిదండ్రులకి, స్కూల్‌కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆల్తూరి ఫౌండేషన్ చైర్మన్ ఆల్తూరి మస్తానయ్య మాట్లాడుతూ.. పది పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకి నగదు బహుమతి అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హర్షద్ హస్సేన్, ఫౌండేషన్ చైర్మన్ ఆల్తూరి మస్తానయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు కుంచాల విజయభాస్కర్, కాకుపల్లి మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య, స్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ ఉత్సవాలు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం అనంతరం మంగళవారం జ్ఞానజ్యోతి ట్రైనింగ్ ముగింపు ఉత్సవాలు నరసాపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఎంఈఓ-1 ఎస్వీ నాయక్ మాట్లాడుతూ.. ఈ శిక్షణలో వెలిగించిన జ్ఞానజ్యోతిని ప్రకాశవంతంగా వెలిగేలా చేయవలసిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపై ఉందని వ్యాఖ్యానించారు. అంగన్వాడి స్కూళ్లలో ప్రీస్కూల్ పిల్లల సంఖ్యను పెంచి తద్వారా ఎలిమెంటరీ స్కూలు పిల్లల శాతాన్ని పెంచేలా చేయాలని తెలిపారు. సిడిపిఓ మాట్లాడుతూ.. అసెస్మెంట్ కార్డు గురించి హబ్బ అంగన్వాడి గురించి వివరించి సెక్టార్‌కు ఒక హబ్ అంగన్వాడీ సెలెక్ట్ చేసి అన్ని అంగన్వాడీ కేంద్రాలకు ఆదర్శంగా ఉండేలా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో డైరెక్టర్ (ఎంఈఓ-1 ఎస్వీ నాయక్) ఎంఈఓ-2 సునీల్, సిడిపిఓ రాజ్యలక్ష్మి హైస్కూల్ హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, సూపర్వైజర్స్ సుబరత్నం, మంజుల, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## అవుట్సోర్సింగ్ ఉద్యోగులని పర్మినెంట్ చేయాలి




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సిటీ 5, 6, 7వ డివిజన్లలోని పారిశుధ్య కార్మికులు తడికల బజార్ సెంటర్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగవారం ఉదయం నిరసన ధర్నా చేపట్టారు. ఆప్కాస్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనిని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని మంత్రివర్గం చేసిన నిర్ణయం తక్షణమే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో సంక్షేమ పథకాలు అమలుచేయకుండా ఉండేందుకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసి ఉన్నారనీ, ఉన్న హక్కులు ఊడపెరికి పని భారాన్ని పెంచి కార్మికుల సమస్యలు గాలికి వదిలేస్తున్నారని తెలిపారు. మునిసిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి నెల్లూరు నగర ప్రజలందరూ మద్దతుని సహకారాన్ని అందించాలని సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త నినాదంతో కార్యక్రమం ప్రారంభం




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'సంకల్ప 'పథకం ద్వారా మనరాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలని సదుద్దేశ్యంతో సంకల్పించిన 'ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. చెత్త నుండి సంపద సృష్టించడంలో భాగంగా అరటి బొంతల నుండి తీసిన నార ద్వారా బ్యాగులు, చీరలు, గృహోపకరణాలు మొదలైనవి తయారు చేయటం గురించి 3 రోజులు జరుగు శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, డాక్టర్ ఆర్.సుజాతరెడ్డి (కృషి విజ్ఞాన కేంద్రం), ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్ రావు, ఇందుకూరుపేట ఏపీఎం షరిత, జీవనోపాదుల ఏపిఎం, నాగేంద్ర ప్రసాద్, సీసీలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, పాల్గొన్నారు.

## విజేత స్కూల్‌లో ముందస్తు శివరాత్రి వేడుకలు




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కామాక్షి మాట్లాడుతూ.. మహా శివరాత్రి హిందువులు ఆచరించే ముఖ్యమైన పండుగని, ప్రతి చాంద్రమాసంలోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు శివరాత్రి జరుపుకుంటారని, అదే రోజున శివ పార్వతులకు వివాహం జరిగిన రోజని ఈరోజు రాత్రి శివుడు తాండవం ఆడుతాడని భక్తుల నమ్మకమని, ఆ రోజునే శివుడు లింగాకారంలో ఆవిర్భవించాడని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఆ తరువాత శివలింగ రూపానికి పూజలు గావించి విద్యార్థులకు ప్రసాదాలు అందించారు.

# చెత్త తరలింపు వాహన ట్రిప్పుల సంఖ్యను పెంచండి

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించే వాహనాల ట్రిప్పుల సంఖ్యను మరింతగా పెంచాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 9వ డివిజన్ బంగ్లా తోట, యనమల పాలెం, ఎఫ్సీఐ కాలనీ, నజీర్ తోట తదితర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రజాపార్కులలో ఎన్ క్యాప్ పథకం కింద అవసరమైన అన్ని మౌలిక వసతులు, చిన్నపిల్లల క్రీడా పరికరాలు, వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ అభిప్రాయ సేకరణలో అడ్మిన్ సెక్రటరీలు చురుకుగా పాల్గొని సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో గతంలో ఫ్లోర్ పాయింట్లుగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసి, నీటితో కడిగి, ముగ్గులతో అలంకరించి, పూల మొక్కలను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. ఇదే విషయమై గతంలోనూ పలుమార్లు సూచనలు చేసినప్పటికీ చర్యలు తీసుకోనందుకు కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను సందర్శించి తాగునీటి నాణ్యత ప్రమాణాలను కమిషనర్ పరీక్షించారు. వాటర్ ట్యాంక్ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై ప్రజలందరికీ అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ డ్రైనేజీ కనెక్షన్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ప్రధాన డ్రైన్ కాలువలు, స్థానిక పంట కాలువలను భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానించే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను ఆక్రమించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్ల మీద అధికారికంగా పార్కింగ్ చేసియున్న వాహనములను గమనించిన కమిషనర్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సహాయముతో వాటిని తొలగించావలసినదిగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా నిర్మాణం అనంతరం మిగిలిన వ్యర్థాలను రోడ్లపై ఉంచరాదని యజమానులకు తెలియజేసి తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా అపార్ట్మెంట్ నిర్మాణం కోసం రోడ్డును ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాన్ని గమనించిన కమిషనర్, వెంటనే ఆ నిర్మాణాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా స్థానికంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణంలో ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ పై వెంటనే మూతలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి, స్థలాలను శుభ్రపరచుకునేలా హెచ్చరించాలని, అలా చేయని పక్షంలో భారీ జరిమానాలను విధించాలని ఆదేశించారు. అల్లీపురం డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్న చెత్త సేకరణ ట్రాక్టర్ పైన వ్యర్థాలను కప్పి ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిని గుర్తించి కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా సమయంలో తప్పనిసరిగా వాహనాలలోని వ్యర్థాలు కప్పబడి వలలు ఉండేలా తగిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్త తరలింపు వాహనాల ట్రిప్పుల సంఖ్యను మరింతగా పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, డంపింగ్ యార్డ్‌లో అదనపు సిబ్బందిని నియమించుకొని ప్రణాళికబద్ధంగా వ్యర్థాలను డంపు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. చెత్త సేకరణ వృత్తి దారులను గుర్తించి వారి పిల్లలను సీడీపీఓ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో జాయిన్ చేయించాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చేన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఈఈ శ్రీనివాసరావు, డిఈఈ రఘురాం, ముజాహిద్దీన్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, ఏసీసీ ప్రకాష్, డివిజన్ ఇన్‌చార్జ్ కువ్వరుపు బాలాజీ, ప్రజాప్రతినిధులు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యను కాపాడుకుందాం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 117 నువెంటనే రద్దు చేయాలని, అలాగే ప్రాథమిక స్కూల్‌లను కాపాడాలని ఆవాజ్ మండల కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడారు. ఉర్దూ స్కూళ్లను కాపాడాలని ఉర్దూ స్కూళ్లో టీచర్లను నియమించి ఉర్దూ బోధనలను విద్యార్థులకు సక్రమంగా నిర్వహించాలని, స్కూళ్లలో సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జున రావు మాట్లాడుతూ.. గత రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 117 తీసుకుని వచ్చి రాష్ట్రంలోనే 12247 పాఠశాలలను ఏకోపాధ్య పాఠశాలలుగా మార్చింది, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ప్రస్తుత ఈ ప్రభుత్వం అదే మాదిరి విద్యా విధానాన్ని తీసుకు వస్తుందని అన్నారు. నాలుగు విధాల విద్యా విధానం తీసుకువస్తున్నట్లు ప్రకటిస్తున్నారు, దీని వలన కొన్ని ప్రాథమిక పాఠశాలలో బేసిక్ పాఠశాలలుగా, కొన్ని పాఠశాలలో ఆదర్శ పాఠశాలలుగా మారుతాయని చెబుతున్నారని తెలిపారు. ఆదర్శ పాఠశాల సంగతి ఎట్లా ఉన్నా బేసిక్ పాఠశాలలు మూతపడే ప్రమాదం వుంది అని పేర్కొన్నారు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలుగా మారిన పాఠశాలల విద్యార్థులకు ఎటువంటి నష్టం లేదని, కానీ ప్రాథమిక పాఠశాలలో యధావిదంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు నియమించి విద్యార్థులకు విద్యను అందించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఆదర్శ పాఠశాలలో, బేసిక్ పాఠశాలల వలన మాతృభాషకి విద్యార్థులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈవిద్యా విధానం వలన భాషా ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోతారని ఆయన తెలిపారు. కావున ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదన విరమించి పాత విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకొని స్కూళ్ళు కాపాడేందుకు పోరాటాలకి పోతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం వారు తహశీల్దార్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీ భాష, మండల కార్యదర్శి షేక్ మునీర్‌అహ్మద్, నాయకులు షబ్బీర్, మహబూబ్ బాషా, డివైఎఫ్ఐ నాయకులు కొమ్మి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు చల్లుకొలుసు మల్లికార్జున రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సూర్య

## విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9963827227


## మొండి బకాయిదారుల తాగునీటి కనెక్షన్లు తొలగించండి : డిప్యూటీ కమిషనర్ చెన్నుడు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయి దారుల గృహాలకు సంబంధించి తాగునీటి కులాయి కనెక్షన్లను తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రెవెన్యూ విభాగం సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లకై వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులను సమన్వయం చేసుకొని తాగునీటి కొళాయిల కనెక్షన్ తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ప్రతి ఒక్క అడ్మిన్ కార్యదర్శి నిర్దేశించిన టార్గెట్లను పన్ను వసూళ్లకు సంబంధించిన వివరాలను సంబంధిత ఆర్ఐకి ప్రతిరోజు నివేదించాలని సూచించారు. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి తుది నోటీసులు జారీ చేసి బకాయిలు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం తప్పనిసరిగా ప్రతి ఒక్కరు వసూలు చేయాలని నిర్దేశించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, రెవిన్యూ ఇన్స్‌ఫెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లెకిన్ రెడ్డిని కలిసిన టీటీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ యూత్ ఇన్‌చార్జ్ లెకిన్ రెడ్డిని 39వ డివిజన్ యూత్ క్లస్టర్ ఇన్‌చార్జ్, యూత్ మెంబర్లు మంగళవారం కలిశారు. యూత్ సభ్యులు సమస్యలను లెకిన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. ఆయన వెంటనే ఆ సమస్యలకు సానుకూలంగా స్పందించారు. మంత్రి నారాయణ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లెకిన్ రెడ్డిని కలిసిన వారిలో బెట్టెం మహేష్ కుమార్, మోహన్ కృష్ణ, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.